## క్లుప్తంగా

### చిన్నారులకు అన్నప్రాసన


అన్నప్రాసన నిర్వహిస్తున్న కుమారి

కెరమెరి: పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని సుల్తాన్‌గూడ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామ పంచాయతీలో అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. శ్యాంమామ్ సూపర్‌వైజర్ నరేశ్, అంగన్‌వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

### వంట సామగ్రి పంపిణీ


వంటపాత్రలు అందిస్తున్న ఎంఈవో సుభాష్

ఆసిఫాబాద్‌రూరల్: వంట సామగ్రిని వంట కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో సుభాష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాలలో ఎండీఎంకు సంబంధించిన వంట సామగ్రిని సంబంధింత ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండీఎం వంట కార్మికులకు పాఠశాలల వారికి వంట సామగ్రి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో అంజద్‌పాషా

కెరమెరి: మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. భూభారతిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇందిరమ్మ ఇల్లు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. ఉపాధి హామీ కూలీలు పనిచేసే చోట సౌకర్యాలు కల్పించాలని, కొత్త కూలీలు వచ్చేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ ఐక్యానాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశేశ్వరరావు పాల్గొన్నారు.

### ఉచిత కంటి శిబిరం


కంటి ఆపరేషన్‌కు తరలిస్తున్న సభ్యులు

కౌటాల: మండల కేంద్రంలోని జాన్వి కంటి ఆసుప్రతిలో జేఆర్ సర్కార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు గురువారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 11 మంది వృద్ధులను కంటి ఆపరేషన్ కోసం మంచిర్యాలలోని పవన్ ఆస్పత్రికి తరలించినట్లు ట్రస్ట్ చైర్మన్ నారాయణ సర్కార్ తెలిపారు.

### పశువుల వాహనాలు పట్టివేత

వాంకిడి: అక్రమంగా పశువులను తరలిస్తున్న నాలుగు వాహనాలను పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు మండలంలోని అకిని గ్రామ స మీపంలో తనిఖీలు నిర్వహించగా.. నాలుగు బొలేరో వాహనాల్లో పశువులు తరలిస్తుండగా పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా పశువులు తరలిస్తుండటంతో 8 పశువులను స్వాధీనం చేసుకుని కాగజ్‌నగర్ గోశాలకు తరలించారు. 8 మందిపై కేసు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

### అర్హులను గుర్తించడంలో పారదర్శకత పాటించాలి

ఇచ్చోడ: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గుర్తించడంలో పారదర్శకత పాటించాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గతంలో సర్వే ఆధారంగా భవిష్యత్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రభుత్వ ఆదేశాలను పాటించాలన్నారు. ఇందిరమ్మ కమిటీలో సభ్యులుతో పాటు అధికారులు ఉంటారని తెలిపారు. సమావేశంలో ఎంపీవో సత్యానంద్, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పల్లెల్లో 'ఉపాధి' జాతర


పిక్లాతండా గ్రామంలో పనులు చేస్తున్న కూలీలు

- గ్రామాల్లో ఊపందుకున్న ఈజీఎస్ పనులు
- సౌకర్యాల కల్పనపై అధికారుల దృష్టి

లింగాపూర్: మండలంలో గత కొన్ని రోజులుగా ఉపాధి హామీ పనులు జోరందుకున్నాయి. రోజురోజుకూ పనులకు వచ్చే కూలీల సంఖ్య పెరుగుతుంది. మండలంలో సాధారణంగా వ్యవసాయ పనులు పూర్తయిన తర్వాత మే నుంచి ఉపాధి పనులు, ఊపందుకునేవి. కాని ఈఏడాది అధికారులు ముందస్తుగా గ్రామాల్లో పనులు గుర్తించి ప్రారంభించారు. మండలంలో అధికారులు వరి, పత్తి, జొన్న పంట వేసిన సమయంలో ఒక రకమైన ఉపాధి పనులను కల్పిస్తుండగా. వ్యవసాయ పనులు పూర్తయినా తర్వాత మరో రకమైనా పనులు కల్పిస్తున్నారు. నాలుగు నెలలపాటు ముమ్మరంగా పనులు చేసేందుకు సంబంధిత అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో సీసీరోడ్లు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రోడ్ల మరమ్మతులు, కాలువల పూడిక తీత, ఫారం ఫండ్, అగ్రికల్చర్‌రోడ్లు, పశువుల పాక, పనులు జరగుతున్నాయి.

**351 పనులు గుర్తింపు..**

మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 351 పనులను గుర్తించారు. సుమారు రూ.కోటి, 70లక్షలతో ఏప్రిల్, మే నెలలో పనులు చేసే విధంగా అధికారులు ముందుకు వెళ్తున్నారు. మండలంలో రోజు రోజుకూ ఒక్క గ్రామ పంచాయతీ నుంచి సరాసరి 200 మందికి పైగా కూలీలు వెళ్తున్నారు. మండలంలో మొత్తం 14 గ్రామ పంచాయతీ నుంచి రోజుకు 4 వేలకు పైగా కూలీలు పనులు చేస్తున్నారు. ఉపాధి పనులు జరిగే చోట టెంట్ హౌస్‌లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు.

**మండలంలో ఉపాధి పనుల వివరాలు..**

| | |
|---|---|
| జాబ్‌కార్డులు | 3,997 |
| కూలీలు | 7,926 |
| గుర్తించిన పనులు | 351 |

**ముమ్మరంగా పనులు..**



గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే పనులకు సంబంధించి ప్రణాళికలను సిద్ధం చేశాం. నిబంధనల ప్రకారం.. ప్రతీ కుటుంబానికి 100 రోజులు పని కల్పిస్తాం. కూలీలకు పనికి తగిన వేతనం అందేలా చర్యలు తీసుకుంటాం.

– చంద్రయ్య, ఏపీవో, లింగాపూర్

# మబ్బులతో రైతుల్లో గుబులు


దహెగాం శివారులో కోతకు వచ్చిన వరి పంట

- గురువారం కురిసిన జల్లులు
- అకాల వర్షాలు పడే అవకాశం
- వరి, మిర్చికి పొంచి ఉన్న ముప్పు

దహెగాం: వాతావరణంలో మార్పుల వల్ల రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై మబ్బులు వస్తున్నాయి. గురువారం ఉదయం తెల్లవారు జామున మోస్తారు వర్షం కురిసింది. బెజ్జూర్ మండలంలో మంగళవారం వడంగళ్ల వర్షం కురవడంతో పుచ్చకాయ పంటకు నష్టం వాటిల్లింది. గాలి దుమారం ఉరుములు వస్తుండడంతో రైతులు గుబులు చెందుతున్నారు. చేతికొచ్చే దశలో అకాల వర్షాలు కురిస్తే నష్టపోవాల్సి వస్తుందని భయాందోళన చెందుతున్నారు.

మండలంలో 7,950 ఎకరాల్లో వరి సాగు అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. వరిలో దొడ్డు రకం అధికంగా సాగు చేస్తున్నారు. సీడ్ వరి సాగు సైతం సుమారు 3 వేల ఎకరాల్లో ఉంటుంది. ప్రస్తుతం సీడ్ వరిలో మగ వరి కోస్తున్నారు. వరి కోతలు ఇప్పుడే ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంతో పాటు, లగ్గాం, పంబాపూర్, ఐన, గిరవెల్లి, గెర్రె, కుంచవెల్లి, పీపీరావు కాలనీ, ఒడ్డుగూడ గ్రామాల్లో వరిసాగు అధికంగా ఉంది. ఖరీఫ్ సీజన్‌లో పత్తి, వరి ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదని యాసంగిలో నైనా దిగుబడి వస్తుందని రైతులు సాగు చేశారు. గత మూడు రోజుల నుంచి అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తున్నాయి. దీంతో వర్షం పడితే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు రైతులు.

**మధ్యాహ్నం ఎండ.. సాయంత్రం మబ్బులు..**

రోజు రోజుకూ ఎండ తీవ్రత పెరుగుతోంది. గత రెండు రోజుల క్రితం 41 డిగ్రీల వరకు చేరింది. వ్యవసాయ పనులకు వెళ్లేవారు. ఎండ తీవ్రతతో ఇబ్బంది పడుతున్నారు. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి గాలి దుమారం లేస్తుంది. వరి కోతకు వచ్చిన నేపథ్యంలో వర్షాలు కురిస్తే నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

# పోషకాహారం ఆరోగ్యానికి మేలు


అవగాహన కల్పిస్తున్న సిబ్బంది


మాట్లాడుతున్న ఎంపీడీవో అల్బర్ట్

లింగాపూర్: పోషకాహారం ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఐసీడీఎస్ కంచన్‌పల్లి సెక్టార్ సూపర్‌వైజర్ సోంబాయి అన్నారు. గురువారం మండలంలోని గుంమ్నూర్(బి) అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ప్రతీరోజు తీసుకునే ఆహారంలో తృణధాన్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. పోషకాహార లోపంతో కలిగే నష్టాలను వివరించారు. అంతకు ముందు గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేశ్వరీ, అంగన్‌వాడీ టీచర్లు సత్యకళ, రంబాబాయి, అంబుబాయి, మంగిబాయి, రేనాబాయి, కౌసల్యాబాయి పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంతో పాటు ఎల్లూర్, కొత్తగూడ, కోయి చిచ్యాల, ఆగర్‌గూడ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం గర్భిణులకు, బాలింతలకు కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అల్బర్ట్ మాట్లాడుతూ.. పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: మండలంలోని జామిని గ్రామంలో గురువారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో ఇందిర మాట్లాడుతూ.. పోషకాహార పదార్థాలు, పరిశుభ్రపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం జామినిలో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన లటపటే నీలాబాయిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేళ్లు మడావి యాదవరావు, కేంద్రే పర్శురాం, గ్రామస్తులు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్లు అప్పగింత


సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న సీఐ రమేశ్

కౌటాల: ఎవరిదైనా సెల్‌ఫోన్ ఎక్కడైనా పోయిన, దొంగలించబడిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని కౌటాల సీఐ ముత్యం రమేశ్ అన్నారు. కౌటాల పోలీస్ సర్కిల్ కార్యాలయంలో గురువారం ఆయన బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగించారు. సీఈఐఆర్ ద్వారా ఫిర్యాదు చేయగా ఫోన్ ట్రేస్ చేసి బాధితులకు ఫోన్లు అప్పగించినట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్సై మధుకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## వడగళ్ల వర్షం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. భారీ వర్షంతో జన జీవనం స్తంభించింది. ఈదురుగాలులతో నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

# కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


సన్మానిస్తున్న నాయకులు

రెబ్బెన: గత నాలుగు నెలలుగా కోలావార్ మన్నెవార్లకు నిలిపి వేసిన కుల ధ్రువీకరణ పత్రాలను వెంటనే విడుదల చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు కోట్నాక విజయ్‌కుమార్, ఆదివాసీ కోలావాల్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్యలు కోరారు. గురువారం రెబ్బెన తహసీల్దార్ రామ్మోహన్‌రావును కలిసి వినతిపత్రం అందచేశారు. రాజ్యాంగం పరంగా కోలావాల్ మన్నెవార్లకు ఎస్టీలుగా సర్టిఫికెట్లు పొందే హక్కు లభించిందన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంట్‌లో జరిగిన చట్టం, గెజిట్ నెంబర్ 5, గెజిట్ నంబర్ 40లకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా మన్నెవార్లను ఎస్టీలుగా గుర్తిస్తూ ఆదేశాలు జారీ చేసిన పత్రాలను తహసీల్దార్‌కు అందజేశారు. గత నెలలుగా కుల ధ్రువీకరణ పత్రాలు అందకపోవడంతో కోలావార్ ప్రజలు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు కొడిపె వెంకటేశ్, మైలారపు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి విలాస్, నాయిని సంతోష్, మొండి, వసంత్‌రావు, మధూకర్, పూదరి రమేశ్, శంకర్, పోచన్న, ప్రమోద్ పాల్గొన్నారు.

**తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం**

రెబ్బెన: తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన కోట్నాక విజయ్‌కుమార్‌ను గురువారం మన్నెవార్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మన్నెవార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్యను సైతం మన్నెవార్ సంక్షేమ సంఘం రెబ్బెన మండల నాయకులు పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్, ప్రమోద్, శంకర్, రమేశ్, పోచన్న, వసంత్‌రావు, మధూకర్ పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

వాంకిడి: ఎండలు పెరుగుతున్న దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మిషన్ భగీరథ సరఫరా జరిగేలా చూసుకోవాలని, లీకేజీలు ఏర్పడితే నిర్లక్ష్యం చేయకుండా మరమ్మతులు జరిగేలా చూడాలన్నారు. ప్రతి జాబ్ కార్డు దారుడికి పని కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో ఖాజా అజీజుద్దిన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శైలేందర్, ఏపీవో శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలి

జైనూర్: వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఆ శాఖ ఎస్ఈ రాథోడ్ శేషారావు అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ తీగలపై వచ్చే చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. బకాయిల వసూళ్లలో వేగం పెంచాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఈ సాయికృష్ణ, సిబ్బంది ఉన్నారు.

## 'చలో ఇంద్రవెల్లి' పోస్టర్ ఆవిష్కరణ

నార్నూర్: ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ఈనెల 20న నిర్వహించే అమరవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలని తుడందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద చలో ఇంద్రవెల్లి పోస్టర్ ఆవిష్కరించారు. అమరవీరుల సంస్మరణ సభ విజయవంతం చేసేందుకు ఆదివాసీలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. అమరుల ఆశయ సాధనతో పాటు హక్కుల సాధన కోసం కృషి చేయాలని అన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు పూసం ఈశ్రు, మాడవి జైవంతరావు, కనక హన్మంతరావు పాల్గొన్నారు.

# పశువులకు టీకాలు వేయించాలి


టీకా వేస్తున్న వైద్యాధికారి సురేశ్

కౌటాల: పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి అంజలి అన్నారు. కౌటాల పశువైద్యశాల ఆధ్వర్యంలో గురువారం మండలంలోని తలోడి గ్రామంలో ఉచితంగా గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా టీకాలు వేశారు. పశువులకు టీకాలు వేస్తే ఆరోగ్యంగా ఉంటాయన్నారు. రైతులు పశుసంపదను పెంచాలని, పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో భిక్షపతి, అమన్, జాఫర్, ప్రకాశ్ పాల్గొన్నారు.

కెరమెరి: మండంలోని మెట్టపిప్రి, పిప్రి, చింతకర్ర గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి సురేశ్ అన్నారు. గురువారం ఆయా గ్రామంలో 597 మూగ జీవాలకు టీకాలు వేశారు. తమ వద్ద పశువులకు ప్రతీ రైతు టీకాలు వేయించుకోవాలని, రానున్న రోజుల్లో వచ్చే వ్యాధులను అరికట్టేందుకు టీకాలు ఎంతో పని చేస్తాయన్నారు.

# విద్యార్థులు ప్రపంచంతో పోటీపడాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు ప్రపంచంతో పోటీపడాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. గురువారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవ కల్చర్, స్పోర్ట్స్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. విద్యార్థులు పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు సంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ ప్రతాప్‌సింగ్, వైస్ ప్రిన్స్‌పాల్ సాయి ప్రసాద్, అధ్యాపకులు రాణి, అనిత, ముజీబ్, స్వామి, చంద్రశేఖర్, కరుణాకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# 'కక్ష సాధింపు చర్యలు సరికాదు'


రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇంద్రవెల్లి: దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడం సరికాదని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ కేసుల పేరుతో వేధింపులకు గురి చేయటాన్ని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశంలో కాంగ్రెస్ బలపడుతుందని ఇలా ఈడీ కేసులతో ఇబ్బందికి గురి చేస్తే ఊరుకోమన్నారు.

**అమరువీరుల సంస్మరణ సభ ఏర్పాట్లు పరిశీలన**

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద ఈనెల 20న నిర్వహించే అమరుల సంస్మరణ సభ ఏర్పాట్లను గురువారం కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి సారిగా అధికారికంగా సంస్మరణ సభ నిర్వహించడంతో ఆదివాసీ సమాజం హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. అమరవీరుల స్తూపం వద్ద స్మృతి వనం ఏర్పాటుకు కోటి రూపాయలు కేటాయించడంతో పాటు అమరుల కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే బాధ్యతలు తీసుకున్నారన్నారు. ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మీర్జా యాకుబ్‌బేగ్, పరత్‌వాగ్ విశాల్, లక్ష్మిబాయి, గోపినాథ్, ఫీరాజీ, గణేష్, నారాయణ పాల్గొన్నారు.

# అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు


మాట్లాడుతున్న ఎంపీడీవో రాజీవీర్

నేరడిగొండ: అర్హులైన వారికే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. గురువారం ఎంపీడీవో సమావేశ మందిరంలో 32 గ్రామ పంచాయతీల ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు కాగా, మండలానికి 335 మంజూరైనట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామపంచాయతీల వారిగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన విషయాలను వివరించారు. ఎంపీవో లక్ష్మణ్, ఆయా గ్రామపంచాయతీల పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారుల ఎంపికను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం ఇంద్రవెల్లి, మెండపల్లి రైతువేదికలో వేర్వేరుగా ఇందిరమ్మ కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, పంచాయతీరాజ్ ఏఈ ప్రభు కిరణ్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, ఈవో సంజీవ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## వారంలో మూడుసార్లు గుడ్లు వడ్డించాలి


వంటలు పరిశీలిస్తున్న ఎంఈవో

కెరమెరి: వారంలో మూడుస్లారు విద్యార్థులకు గుడ్లు వడ్డించాలని, మెనూ ప్రకారంగా మధ్యాహ్న భోజనం ఇవ్వాలని, సామర్థ్యాల ఆధారంగా విద్యా బోధన చేయాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. గురువారం మండలంలోని రింగన్‌ఘాట్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఎండీఎం, ఎఫ్ఎల్ఎన్ తదితర రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్య పుస్తకాలను చదివించారు. హెచ్ఎం అజయ్‌కుమార్, టీచర్ కిషన్ ఉన్నారు.